# కునుకు

టి. వీర్రాజు

*

తండ్రి:—ఉష, అబ్బబ్బబ్బా, మహాచెడ్డ చీదరగా వుంది. వెధవ ఉద్యోగం కాని...

కూతురు:—ఏం నాన్నా, ఇంత ఆలస్యం అయింది ఈ వేళ—నిన్న మధ్యాహ్నం వెళ్లినవాడవు, ఇంతవరకూ రానే లేదేవిటి?

తండ్రి:—మరేనమ్మా, మామూలుగా చీకటితోటే వచ్చెయ్యవలసింది. అదుగో, వాడెవడో సెలవు పెట్టాడు. ఇందుకోసవని, ఆయనగారి డ్యూటీ కూడా నా నెత్తిన పడింది.

కూతు:—బాగానేవుంది. వాళ్ళెవరో రాకపోతే మధ్యన నీకా. ఇవతల వాళ్ళు మాత్రం అలాటి వాళ్లు అనుకోరు కాబోలు.

తండ్రి:—వాళ్లకేం కావాలమ్మా — మన కష్ట సుఖాలు, కంపెనీవాళ్ళకి ఎంత సేపూ తమపని సరిగ్గా జరుగుతోందా లేదా అని తప్ప.

కూతు:—లేచి భోజనం చెయ్యి. ఇప్పటికే పొద్దు పోయింది.

తండ్రి:—ఇంకేం భోజనంలే. వచ్చేటప్పుడు ఫలహారం తీసుకొచ్చాను. రాత్రి వచ్చాక ఏకంగా భోంచేస్తాను.

కూతు:—వచ్చాక అంటే కొంపతీసి మళ్లీ వెళ్లాలా ఏమిటి?

తండ్రి:—ఒకటా, ఈ వేళల్లా వాడు సెలవేట. రాత్రి పదిగంటల వరకూ ఆ పని నేను చెయ్యవలసిందే. తలంతా చిరాకుగా వుంటేను. ఓ కునుకుపోయి మళ్లీ వెడదావని చక్కా వచ్చాను. ఎలా వుందనుకున్నావేంటి తల.

కూతు:—కాదుమరీ, మంచంమీద పక్కెయ్యనా?

తండ్రి:—ఎందుకులే యీ బల్లమీదే కాస్సేపు వొరుగుతాను. మీ అమ్మేది?

కూతు:—మేడమీదుంది. బట్టలు కుడుతూన్నట్టుంది.

తండ్రి:—పోనీకాని, కొంచెంసేపు ఎవర్నీ లేపవద్దని చెప్పు. మళ్ళీ ఓ గంటలో లేచి వెళ్లాలి.

కూతు:—అలాగే, పడుకో నాన్నా.

............

తల్లి:—అమ్మాయీ, అమ్మాయీ, పలకవేమే మొద్దా.

కూతురు:—ఉష్, అంత గట్టిగా కేకెయ్యాలా! ఊ—ఏం, ఏం మునిగిపోయిందేమిటి? నాన్న పడుకున్నారు. ఎవరూ లేపకుండా చూడమన్నారు.

తల్లి:—ఎప్పుడొచ్చారు. చెప్పావే కావేం. ఏవండీ, ఎంతసేపైంది వచ్చి.

తండ్రి:—ఉష్. ఊ, నువ్వా.

తల్లి:—ఎంతసేపైంది?

తండ్రి:—ఇప్పుడే, 10 నిముషాలు.

తల్లి:—ఈ వాళ ఇంతసేపు చేసారేం. నేను బజారు కెళ్ళాలనుకున్నా కదా...రోజూ తెల్లారేసరికొచ్చేవారు.

తండ్రి:—ఏమో, నువ్వు ఎక్కడికి వెడతావనుకుంటున్నావో, నేనేం కలగన్నానా ఏం?

తల్లి:—ఇప్పుడు భోజనం చేస్తారా? ఆవిడ ఇంతట్లోకే వొచ్చేస్తుందేమో కూడాను.

తండ్రి:—ఎవరావిడ?

తల్లి:—మన సీతమ్మగారు. చీరలేవో కొనుక్కోవాలిట. నన్ను కూడా రమ్మంది. తీరా వెడతాం అనుకుంటూంటే ఇంతట్లోకేమీరొచ్చారు. ఓ పావుగంట ముందర రాకూడదూ?

తండ్రి:—నేను నీకేమి అడ్డు? నన్నిలా పడుకోనిస్తే చాలు కాస్సేపు.

తల్లి:—భోజనం?

తండ్రి:—భోజనం వద్దు బొద్దూ వద్దు. నన్ను పడుకోనిద్దు బాబూ.

తల్లి:—అంత విసుగెందుకు, వెడుతున్నాను లెండి మళ్ళీ సాయంత్రం దాకా మీ కెదురుపడను.

తండ్రి:—పది గంటలదాకా నేను పడను. తే

పోతే ఏవిటుది. ఒక్క కునుకు పోదావని నే
నో నే?

తల్లి:—ఏమో ఎవరికి తెలుసూ ఆ గొడవంతాను. ఆఫీసుమీదున్న కోపమంతా నామీదే?

తండ్రి:—సరే వెళుదూ నీకు పుణ్యం వుంటుంది.

కొడుకు:—అమ్మా, అమ్మా, సీతమ్మగారు.

తల్లి:—వస్తున్నానండీ... నే వెళుతున్నాను.

తండ్రి:—బతికించావు.....అమ్మాయీ, ఆ కిటికీ కొంచెం వేసెయ్యమ్మా.

.............

(తలుపు చప్పుడు)

కూతురు:—వస్తున్నా...అంత గట్టిగా కొట్టాలా. నాకేం చెవుడనుకున్నావా?

కొడుకు:—ఏం, ఏవొచ్చిందిప్పుడు?

కూతురు.—నాన్న పడుకున్నారు.

కొడుకు:—ఇప్పుడా, ఇప్పుడు నిద్రేవిటే?

కూతురు:—అదంతా నీకెందుకు. కొంచెం మెల్లిగా మాట్లాడుదూ నీకు పుణ్యం వుంటుంది.

కొడుకు:—సరేగాని అమ్మెక్కడుందీ చెప్పు.

కూతురు:—ఎందుకూ?

కొడుకు:—చెప్పమంటే త్వరగా, ఆ ప్రశ్నలన్నీ నీ కెందుకు?

కూతురు:—అయితే నే చెప్పను—

కొడుకు:—అందుకే నాకు కోపం వస్తుంది. వాళ్లంతా నాకోసం కనిపెట్టుకుంటే......

కూతురు:—ఎవరు వాళ్ళంతా?

కొడుకు:—మా స్నేహితులే బాబూ. మూడు గంటలికి సినీమా కెడతాం అని అనుకున్నాం, అమ్మేదీ?

కూతురు:—ఇంట్లో లేదు.

కొడుకు:—సీతమ్మగారింటి కెళ్లిందా?

కూతురు:—ఇద్దరూ కలిసి బజారు కెళ్లారు.

కొడుకు:—చచ్చాముగా దేవుడా, పోనీ, నీ దగ్గరేవన్నా డబ్బులున్నాయా?

కూతురు:—లేవు.

కొడుకు:—అమ్మొచ్చాక మళ్ళీ యిచ్చేస్తానే? వాళ్లంతా కనిపెట్టుకున్నారు నాకోసం.

కూతురు:—లేవని చెప్పలే?

కొడుకు:—ఎలాగే మరి. పోనీ నాన్నని అడుగుతావూ?

కూతురు:—నీ సినీమా కోసం నిద్రపోతున్న వాడిని లేపనా?

కొడుకు:—తీరా వస్తానని వాళ్ళందర్నీ అగమన్నానే......

కూతురు:—ఏమో బాబూ.

కొడుకు:—ఓ పనిచేస్తాను, నాన్న కోటు తొడుక్కునే వున్నాడుగా. మెల్లిగా పర్సు తీసి—

కూతురు:—ఆఁ...దొంగ తనమా?

కొడుకు:—పూర్తిగా విను. డబ్బులు తీసుకుని వెళ్ళిపోతాను. లేవగానే నువ్వు చెప్పు లేపడం ఎందుకని అలా చేశాడని.

కూతురు:—నాన్నకి మెలుకువొస్తే...—

కొడుకు:—రాకుండా నే చేస్తాగా.....నువ్వేం మాట్లాడకు.

తండ్రి:—అబ్బబ్బబ్బా, ఎవడ్రా అది.....ఓరి దొంగా, ఏవిటుది.

కొడుకు:—అది కాదు నాన్నా...—వాళ్ళంతా నుంచున్నారు. సినిమాకి గమ్మని.....అమ్మ ఎక్కడికో వెళ్లిందిట......

తండ్రి:—నీ సినిమా గొడవ యివాళే రావాలా? పో...యీ డబ్బులు పట్టుకు పో.

కొడుకు:—లేదు నాన్నా...

తండ్రి:—సరేలే, ఇంక వెళ్ళు.

కొడుకు:—నాన్నా పర్సు తీశానని ఏమీ అనుకోకు నాన్నా.

తండ్రి:—ఏమీ అనుకోనురా బాబూ, నీ సదుద్దేశం నెరగనూ, నువ్వు చాలా మంచివాడవు, వెళ్లు.

డాక్టరు భార్య సలహా



కొడుకు:—వాళ్ళందర్నీ అక్కడ నిలబెట్టాను నాన్నా.

తండ్రి:—అందుకే వెళ్ళమన్నానుగా. వెళ్ళు... నన్ను పడుకోనియ్యి....ఇంకొక్క అరగంట. అబ్బబ్బా...ఆ తలుపు తీసే వుంచమ్మా. మళ్ళీ ఇంకొక శ్లేవరేనా బాదుతారు.

............

కొడుకు:—అక్కయ్యా, అక్కయ్యా....మాకు యీ వేళనుంచి శెలవలోయి.

కూతురు:—వుష్.

పిల్ల:—నాన్నా, నాన్నా, మా బడికి సెలవలిచ్చారోయి. ఎంచక్కా రేపట్నుంచి సెలవలోయి.

కూతురు:—నాన్నని లేపకు మొద్దూ.

పిల్ల:—నీకేం. నాన్నా, రేపేం రేపేం హాయిగా ఇంట్లో కూర్చుని ఆడుకోవచ్చు. పొద్దున్న పది గంటలకి లేస్తాను, తెలుసా.

తండ్రి:—ఇప్పుడు నన్ను మాత్రం నిద్రపోనివ్వకు.

పిల్ల:—నాన్నా, మరి నాకు కొత్త రిబ్బన్లు తెచ్చి పెడతా నన్నావు ఏవమ్మా?

తండ్రి:—చూద్దాంలే రేపు... వెళ్ళి ఆడుకో.

పిల్ల:—ఆ రేపు...ఎప్పు డడిగినా అలాగే అంటావు రేపు రేపు అని.

తండ్రి:—అమ్మాయీ, దాన్ని ఇంట్లోకి తీసుకెళ్ళు.

కూతురు:—ఇలారా, మొద్దూ.

పిల్ల:—ఆవ్, ఆవ్, వొదిలేస్తే నే వొదిలావు. కరిచేస్తాను చెయ్యి.

తండ్రి:—పాపాయీ, నీకు సాయంత్రం కొనిపట్టుకొస్తాను కాని రిబ్బన్లు. కొంచెంసేపు అల్లరి చెయ్యకమ్మా మంచిదానవు.

పిల్ల:—ఊఁ. అన్నీ అబద్ధాలు.

తండ్రి:—లేదు, నిజంగానే. కొంచెంసేపు గొడవ చెయ్యకుండా, నన్ను నిద్దరోనిస్తేనే......

పిల్ల:—అలాగే, నిద్దరో.

చాకలి:—అమ్మగారండీ, అమ్మగారండీ....చాకల్నండి.

కూతురు:—నీ నోరు నొక్కెయ్య ఎందుకురా అలా అరుస్తావ్?

చాకలి:—అదేంటండీ. ఎండలో నాలుగు మైళ్ళు నడుచుకుంటూ వొచ్చేసరికల్లా అలా తిడతారు?

కూతురు:—లేకపోతే, ఏవిటండీ. అంత గట్టిగా పిలవాలా? నాన్నగారు పడుకున్నారు కనిపించటంలే?

చాకలి:—అయ్యో బాబూ, నాకే మెరుకండి? లోపలున్నారు గందాని పిలిచానుగాని.

కూతురు:—లోపలుండే. పాపం ఆయనకి తీరా కునుకు పట్టేసరికల్లా......

చాకలి:—అరున్నారని నే నెరుగుదు నేమండీ... అమ్మగారు యీయాళ రమ్మన్నారని నే నొచ్చాను.

బం:—ఏవిట్రా చాకలీ గొడవ.

చాకలి:—చిత్తం బాబయ్యా...తమరు తొంగున్నారని ఎరక్కపోయి......

తండ్రి:—పరవా లేదులే, నీదికాదు తప్పు. టైము ఎంతయింది...అయిందీ ఆ కాస్తాను. అమ్మాయీ చూడమ్మా. కొంచెం నీళ్లు పెట్టు. త్వరగా కాఫీతాగి వెడతాను.

బం:—సర్, సర్.

తండ్రి:—ఎవరది...ఇలా లోపలికిరా. ఏం అప్పలస్వామి?

బం:—సూపరింటుగారు తమర్ని వెంటనే రమ్మన్నారండి.

తండ్రి:—ఏం, ఏం ములిగిందేవిటి ఇంతట్లోకీ? అసలు నేనిలా వొచ్చానని ఆయన కెవరు చెప్పారు?

బం:—ఆరే వొచ్చారండి. తమ రెక్కడున్నారని అడిగితే ఫలహారాని కెళ్ళారని కామోసని ఇప్పుడే వొచ్చేస్తారని చెప్పానండి. కొంతసేపయ్యాక మళ్ళీ పిల్చి, ఇంకా రాలేదంటే, ఇక్కడికి పంపించారండి పిల్చుకు రమ్మని.

తండ్రి:—ఎప్పుడూ లేంది ఆయనకి ఈవాళే కావలిసొచ్చాను. ఈ మాత్రానికి అక్కడే వుంటే, వొదిలిపోయేది మూడు మైళ్ళు రానూ, మూడు మైళ్ళు వెళ్ళనేనా తప్పేది—ఈ మాత్రం కునుకు కోసం!

—ఆలిండియా రేడియోనుండి.

ఆకర్షణీయమైన రచనలకు ఆనందవాణి